
# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

February / ఫిబ్రవరి -2025

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 101    February / ఫిబ్రవరి-2025    No./ సంచిక : 2


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|

| 1. | ప్రార్థన- అనువక - కందాడై రామానుజాచార్య (శ్రీహరివంశము) | 2 |
| 2. | ధ్యానము - శ్రీ సదాశివ బ్రహ్మేంద్రస్వామి (ఆత్మవిద్యావిలాసము) | 6 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 7 |
| 4. | ఆనంద రామాయణము - పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 10 |
| 5. | గురువాచకకోవై - శ్రీ మురుగనార్-వివరణ సాయికృష్ణ | 15 |
| 6. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 18 |
| 7. | వివేకము - ఎమ్.ఎస్.రంగారావు | 22 |
| 8. | ఓంకారస్వామివారితో నా చిన్న అనుభవం ఆశ్రమవాసి వై. సత్యనారాయణ. | 23 |
| 9. | కార్యక్రమములు - విరాళములు | 25 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

**తీవ్రధ్యానంలో ఇంద్రియాలు కట్టుబడతాయి**

**శ్లో॥** రుద్రో దేవత్వం రుదనాద్ద్రావణాచ్చ
రోరూయమాణో ద్రావణాచ్చాతిదేవః
భక్తం భక్తానాం వత్సలం వత్సలానాం
కీర్త్యా యుజ్మ్వైశాద్య ప్రపద్యే శరణ్యమ్

**తా॥** దేవా! రోదించుట వలన రోదింపచేయుట వలన గొప్పగా ధ్వని చేయుట వలన జన్మ మరణ రూప సంస్కారమును పారదోలుట వలన రుద్రుడవు దేవతలను మించినవాడనైతివి. నేను నీ భక్తులకు భక్తుడను. తమను ప్రేమించువారిని ప్రేమించువాడను. ఈశా! నన్ను కీర్తిమంతుని చేయుము. నిన్ను శరణు పొందుచున్నాను.

**శ్లో॥** గ్రామ్యారణ్యానాం త్వం పతిః త్వం పశూనామ్
ఖ్యాతో దేవః పశుపతిస్సర్వ కర్మా
నాన్యస్త్వత్తః పరమో దేవదేవ!
జగత్పతిస్సురవీరారిహన్తా

**తా॥** గ్రామములో నుండు అరణ్యములలోనుండి పశువులకు నీవు పతివి గాన నిన్ను పశుపతిగా అందరూ చెప్పుచుందురు. దేవదేవా! నీకంటె ఉత్తముడు ఇంకొకడు లేడు. సకల జగత్కర్మ నీదే. నీవే జగత్పతివి. దేవవీరుల శత్రువులైన రాక్షసులను సంహరించువాడవు.

**శ్లో॥** యస్మాదీశో మహతా మీశ్వరాణాం
భవానాద్యః ప్రీతిదః ప్రాణదశ్చ
తస్మాద్ధిత్వామీశ్వరం ప్రాహురీశమ్
సంతో విద్వాంసః సర్వశాస్త్రార్థతజ్ఞాః

**తా॥** నీవు గొప్పవారికి ఈశ్వరులకు ఈశ్వరుడవు. మొదటివాడవు. ప్రీతిని ప్రసాదించువాడవు. ప్రాణమునిచ్చువాడవు. కావుననే నిన్ను సకల శాస్త్రార్థములు చక్కగా తెలిసినవారు విద్వాంసులు సజ్జనులు ఈశ్వరుడని ఈశుడని అనుచున్నారు.

**శ్లో॥** భూతం యస్మాజ్జగదత్యన్త ధీర!
త్వత్తో ఉ వ్యక్తా దక్షరాదక్షరేశ!

తస్మాత్త్వామాహుర్భవ ఇత్యేవ భూతం
సర్వేశ్వరాణా మహతామప్యుదారమ్

**తా॥** అత్యన్తా! మృత్యువును అతిక్రమించినవాడా! ధీర! బుద్ధిలో అనగా జ్ఞానములో రమించువాడా! బుద్ధిని ప్రేరేపించువాడా! అక్షరేశా! నశించని జీవులకు ఈశుడవు. ఎవరికీ తెలియరాని ఎన్నడూ నాశము లేని నీనుండియే జగత్తు ఆవిర్భవించినది. అందుకే తమను భవుడు అందురు. వాస్తవముగా తాము భూతము. అనగా నిత్యశుద్ధుడవు. మహానుభావులకు సకల ఈశ్వరులకు కూడా తాము ఉదారులు అనినచో ఇక దీనులకు దుఃఖితులకు అని విడిగా చెప్పవలయునా!

**శ్లో॥** యస్మాజ్జితైరభిషిక్తోసి సర్వైః
దేవాసురైస్సర్వ భూతైశ్చ దేవ
మహేశ్వరం విశ్వకర్మాణ మాహుః
త్వాం వైసర్వే తేన దేవాతిదేవమ్

**తా॥** నీ చేత పరాజితులైన దేవతలు, రాక్షసులు సకల భూతములు తమను మహేశ్వర పదమున పట్టాభిషిక్తుని చేసిరి. కావున విద్వాంసులందరు తమను విశ్వకర్మ అని మహేశ్వరుడని దేవాతిదేవుడని కీర్తించుచున్నారు.

**శ్లో॥** పూజ్యోదేవైః పూజ్యసే నిత్యదావై
శశ్వచ్ఛ్రేయః కాఙ్క్షిభిర్వరదా మేయ వీర్య
తస్మాద్విఖ్యాతో భగవాన్దేవ దేవః
సతామిష్టః సర్వభూతాత్మభావ!

**తా॥** ఇంతని లెక్కించ శక్యము కాని పరాక్రమము కలవాడా! వరములను ఇచ్చువాడా! శ్రేయస్సును కోరు దేవతలచే నిత్యము పూజించబడుచున్నావు. కావుననే నీవు భగవంతుడవు, దేవదేవుడవుగా అనగా దేవతలకు కూడా దేవతగా ప్రసిద్ధి చెందితివి. సత్పురుషులకు ఇష్టుడవు. సకల భూతములను నీలోనే సృజించగలవాడవు.

**శ్లో॥** భూమిత్రయాణాం దేవయస్మాత్ప్రతిష్ఠా
పునర్లోకానాం భావనామేయకీర్తిః
త్ర్యమ్బకేతి ప్రథమం తేన నామ
తవా ప్రమేయ త్రిదశేశనాథ!

**తా॥** బ్రహ్మాది దేవత్రయులకు అధినాధుడవు! అప్రమేయమైన కీర్తి కలవాడా! అప్రమేయ స్వరూపా! అన్ని లోకములను సృజించువాడా! కావుననే భూలోక భువర్లోక సువర్లోకములను మూడు భూములకు అధినాయకా! కావుననే తమకు త్ర్యమ్బకుడని పేరు.

**శ్లో॥** శర్వశ్శత్రూణాం శాసనాదప్రమేయః
తథా భూయః శాసనాచ్చేశ్వరేణ
సర్వవ్యాపిత్వాచ్ఛఙ్కరత్వాచ్చసద్భిః
శబ్దస్యేశానః శ్రీకరార్కాగ్ర్యతేజాః

**తా॥** జగత్తును సంహరించువాడవు గాన శర్వుడని, శత్రువులను శాసించువాడవుగాన అప్రమేయుడవని, ఈశ్వరరూపముగా సకల జగత్తును శాసించుట వలన ఈశ్వరుడవని, సకల జగత్తును వ్యాపించియున్నందున సజ్జనులకు శుభమును కలిగించువాడవు, గాన శ్రీని అనగా సంపదను కలిగించువాడవు గాన పరమేశ్వరుడవు సకల శబ్దములు తమనే ప్రతిపాదించుచున్నవి గాన సూర్యుని అతిక్రమించు తేజస్సు కలవాడవు.

**శ్లో॥** సంసక్తానాం నిత్యదాయత్కరోషి
శమం భ్రాతృవ్యాన్ యద్యనైషైః సమస్తాన్
తస్మాద్దేవశ్శఙ్కరో౽స్య ప్రమేయః
సద్భిర్ధర్మజ్ఞై కథ్యసే సర్వనాథః

**తా॥** భక్తులకు అన్నివేళలా సుఖశాంతులను ప్రసాదించువాడవు. శత్రు భావముతో ప్రవర్తించువారిని దండించువాడవు కావున తమను అప్రమేయ శక్తిశాలివి శుభమును కలిగించువాడవు గాన శఙ్కరుడవు. ధర్మము తెలిసిన సజ్జనులు తమను సర్వనాధుడు అందురు.

**శ్లో॥** దత్తః ప్రహారః కుశౌన పూర్వం
తవేశాన సురరాజ్ఞాతి వీర్యః
కంఠేనైల్యం తేనతేయత్ప్రవృత్తం
తస్మాత్ఖ్యాతస్త్వం నీలకంఠేతి కల్పః

**తా॥** అతిపరాక్రమము కల ఈశ్వరుడా! పూర్వము ఒకసారి దేవరాజైన ఇన్ద్రుడు తన వజ్రాయుధముతో నీ కంఠభాగమున ప్రహరించెను. ఆ ప్రహారము వలన నీ కంఠభాగమున నీలిమ ఏర్పడెను. కావుననే నిన్ను అందరూ నీలకంఠుడు

అని చెప్పుకొనుచున్నారు. నీవు ఇంద్రుని నిగ్రహించు సమర్థుడవైననూ దయాళువు గాన అతని అపరాధమును క్షమించితివి.

**శ్లో॥ యల్లిఙ్గాఙ్కం యచ్చలోకే భగాఙ్కం**
**సర్వం సోమత్వం స్థావరం జఙ్గమంచ**
**ప్రాహుర్విప్రాస్త్వాం గుణినం తత్త్వవిజ్ఞాః**
**తథాధ్యేయామంబికాం లోకధాత్రీమ్**

**తా॥** ఈ లోకమున ఉన్నదంతయూ లిఙ్గాఙ్కము భగాఙ్కమే కదా! కావున పార్వతీసహిత పరమేశ్వరా! ఈ చరాచర జగమంతా తామిద్దరే. తమ ఇద్దరి స్వరూపమే. కావున తత్త్వము తెలిసిన బ్రాహ్మణోత్తములు తమను గుణవంతునిగా లోకజనని అయిన ధ్యానించదగిన అంబికను త్రిగుణరూపగా చెప్పుచుందురు.

**శ్లో॥ వేదైర్గీతాసాహితత్ త్వం ప్రసూతా**
**యజ్ఞోదీక్షాణాం యోగినాం చాతి రూపాః**
**నాత్యద్భుతం త్వత్సమం దేవభూతం**
**భూతం భవ్యం భవదేవాధనాస్తి**

**తా॥** ఆ అంబికయే వేదములలో మాయ అను పేరుతో వర్ణించబడు చున్నది. ఆమెయే మహత్తత్త్వమునకు జనని. తాము యజ్ఞమున దీక్ష స్వీకరించు యజమానులకు ద్రవ్యయజ్ఞము. యోగులకు యోగియజ్ఞము. తాము లౌకిక రూపముతో పైకి కనపడుచున్న దివ్య చిన్మయ విగ్రహమును ధరించినవాడవు. దేవా! మీతో సాటివచ్చు అద్భుతతత్త్వము భూతము ఇపుడు లేదు. ఇకముందు ఉండదు.

**శ్లో॥ అహం బ్రహ్మ కపిలోయోఽప్యనన్తః**
**పుత్రాస్సర్వే బ్రహ్మణశ్చాతి వీరాః**
**త్వత్తస్సర్వే దేవదేవ ప్రసూతాః**
**ఏవం సర్వేశః కారణాత్మాత్వమీడ్యః**

**తా॥** నేను బ్రహ్మ కపిలుడు అనన్తుడు అంత శత్రువులకు జయించుట వలన అతి వీర్యవంతులుగా పేరుపొందిన బ్రహ్మపుత్రులు సనకాదులు వీరందరూ నీనుండి పుట్టినవారే. దేవదేవా! ఇట్లు తాము సర్వేశ్వరులు, కారణస్వరూపులు. కావున స్తుతించదగినవారు తామే.



# ధ్యానము

**శ్లో॥ జాగ్రన్ముఖ త్రివిధ ధామసు సాక్షిణీ యా**
**జాగ్రన్ముఖ త్రివిధధామ విలక్షణా యా ।**
**స్వప్నాద్యనుస్మృతి బలాత్మతతైక రూపా**
**సై వాహమస్మి చితి రిత్యవధారయ త్వమ్**

**తా॥** జాగ్రత్తు మొదలైన మూడు స్థానాలకి సాక్షి యేదో, స్వప్నం మొదలైన వాటి నిరంతర జ్ఞాపకం ఉంటున్న కారణంవల్ల నిత్యమూ ఒకే రూపంగా (నిర్ధారిత మైంది) ఉండేది ఏదో ఆ చితినే నేను అని నిరంతరం భావన చెయ్యి.

ఇది తప్పనీ, అది ఒప్పనీ విమర్శించవద్దు. విమర్శల వల్ల ఎవ్వరూ బాగుపడరు. నీవు గాఢనిద్రలో ఉన్నప్పుడు తప్పు, ఒప్పు తెలుస్తున్నాయా? తెలియటంలేదు. అందుచేత మెలకువలో నిద్రపోవడం అభ్యాసం చేయి. నీవు ఆత్మలో నిలకడ చెందినప్పుడు మాత్రమే ఇది సాధ్యమౌతుంది. పరిసరాలను విస్మరించి ఆత్మస్థుడివికా. నీవు ఇతరులకు ఎంతగాచెప్పినా, వారు అవి గ్రహించలేరు. ముందు నీవు మంచిగా ఉంటూ మౌనంగా ఉండు. ఇట్లా మౌనంగా వుండటం చేత, నీ ఇచ్ఛాశక్తి వృద్ధిపొందుతుంది. అప్పుడు ప్రపంచం భగవంతుని రాజ్యంగా విలసిల్లుతుంది. స్వర్గరాజ్యం నీలోనే ఉంది. **– శ్రీభగవాన్ రమణ మహర్షి**

మన మనసులోని తలంపులు మనల్ని భయపెట్టేవిగా ఉండవచ్చు. ఒక్కోసారి పరిసరాల నుంచి పారిపోయేలా చేయవచ్చు. నిజానికి అవన్నీ పేకమేడలే. వాటికి బలమైన పునాది అంటూ ఏమీ లేదు. ఈ విషయాన్ని గ్రహించి, వాటి మీది నుంచి దృష్టిని మరల్చితే వాటంతట అవే కుప్పకూలిపోక తప్పదు.

**– శ్రీభగవాన్ రమణ మహర్షి**

ఎంతటి విషమపరిస్థితులెదురైనా మంచితనం, మానవత్వాలపై నమ్మకాన్ని పోగొట్టుకోకూడదు. **– శ్రీ రామకృష్ణ పరమహంస**

ఏం మాట్లాడాలో తెలిసినవాడు తెలివైనవాడు. ఏం మాట్లాడకూడదో తెలిసినవాడు వివేకవంతుడు. **– శ్రీ రామకృష్ణ పరమహంస**

పదునైన ఆయుధం కంటే క్షణకాలంలో వచ్చే కోపమే అత్యంత ప్రమాదకరం. తొందరపాటులో ఉన్నప్పుడు మాట్లాడకపోవడమే మంచిది.

**–శ్రీ రామకృష్ణ పరమహంస**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

మూలం : స్వామిఓంకార్ అనువాదం : బొప్పన అరుణాదేవి

(గత సంచిక తరువాయి) అధ్యాయం - 58

## శాంతి ఆశ్రమములో సేవా కార్యక్రమాలు

**గురుకులము**

చివరికి మా జ్ఞానేశ్వరి యొక్క గొప్ప ప్రేమ, సేవల మూలంగా ఇంకా శ్రీ సి.హెచ్.వి.రాజు గారు ఇంకా ఇతర ఆశ్రమ సభ్యులు, శ్రేయోభిలాషులు, స్నేహితుల సహకారము వలన మేము ఇరవైమంది పిల్లలతో గురుకులాన్ని ప్రారంభించాము. నెమ్మదిగా పిల్లలు పెరుగుతూ వచ్చి ఇప్పుడు డెబ్భై ఐదు మంది విద్యార్థులు ఉన్నారు. వారందరూ అనాథలు, నిరుపేదలు, అలాగే భక్తుల పిల్లలు కూడా ఉన్నారు. భక్తులు ఇది తమకు చాలా మంచి అవకాశంగా భావించి, తమ పిల్లలు ఆశ్రమ వాతావరణములో, పవిత్రమయిన స్థలంలో ఆధ్యాత్మిక విద్యను నేర్చు కుంటారని భావించారు. విశ్వ విద్యాలయాల్లో బి.ఎ., ఎం.ఎ.లుగా మార్చినట్లుగా మేము మా గురుకులంలోని విద్యార్థులను భగవంతుని అనుగ్రహంతో కొద్దిమంది నయినా శ్రీకృష్ణుడిగా, జీసస్‌గా, బుద్ధుడిగా, మహమ్మదుగా, గాంధీగా, నెహ్రూగా, వివేకానందుడిలాగా, విశ్వనాథ్‌లాగా తయారు చేయాలని ఆశిస్తున్నాము.

ఒక గొప్ప జ్ఞాని అంటారు "మీరు గొప్ప వేటగాడు కావాలి అని కోరుకుంటే దోమలను, ఈగలను వేటాడవద్దు. పులులను, సింహాలను వేటాడాలి". మనము కలలు కనాలనుకుంటే మహోన్నతమయిన కలలు కనాలి. ఈ విశ్వంలోని సమస్త మానవాళి ప్రయోజనం కోసం కేవలం ఈ రోజుకి కాకుండా శాశ్వతంగా మేలు చేయాలి.

నేను ఎల్లప్పుడూ కలలు కంటూ ఉండేవాడిని. శాంతి ఆశ్రమము గురించి కలలు కన్నాను. తోటపల్లి కొండల్లోని అడవిని ఆశ్రమంగా మలిచాము. అదే విధంగా వాల్తేరు ఆశ్రమము, కైలాస ఆశ్రమము ఋషికొండ సముద్రపు ఒడ్డున అందరి శ్రేయస్సు కోరి తీర్చిదిద్దాము. వాటి గురించిన నా కలలు సాకారమయ్యాయి. వాటిని మీ అందరికి వారసత్వ సంపదగా సమర్పిస్తున్నాను. ఇప్పుడు గురుకులానికి బీజము వేశాము. అది నా చిరకాలమయిన కల. దానిని మీకు అందచేయటము నాకర్తవ్యము. అది పెద్ద వటవృక్షంగా మారి తూర్పు పడమర దేశాల్లోని అన్ని మతాలకి చెందిన విద్యార్థులందరికీ చల్లని నీడని ప్రసాదించే వరకు మీరు దానిని జాగ్రత్తగా సంరక్షించాలి.

మా వద్ద మంచి అంకితభావం గల ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. వారిలో



ఒకరు సంగీతము, ఇంకొకరు కుట్టుపని నేర్పేవారు. పాఠశాలకు చాలా పెద్ద భవనము. ఆడపిల్లలకి, మగపిల్లలకి రెండు వసతి గృహాలు ఉన్నాయి. పిల్లలందరూ ఉదయాన్నే నిద్రలేచి స్నానం చేసి ఆధ్యాత్మిక భక్తిగీతాలు ఆలపించేవారు. ఉపాహారం తర్వాత పాఠశాలకు వెళతారు. వాళ్ళందరూ తోటపని లాంటి వివిధ పనుల్లో నిమగ్నమయ్యే వారు. వారిలో కొంచెము పెద్దవాళ్ళు ముద్రణాలయంలో ఆశ్రమవాసులకు సహాయం చేసేవారు. గురుకుల విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలములో ఉయ్యాలలు, సీసాలాంటి ఇతర ఆటవస్తువులుండేవి. సాయంత్రపు వేళల్లో విద్యార్థులు భజనల్లో, ప్రార్థనల్లో పాల్గొనేవారు. ప్రత్యేకమయిన పండుగ సెలవుదినాల్లో క్రిస్టమస్, శ్రీరామ నవమి మరియు శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేకమయిన సత్సంగాల్లో విద్యార్థులు పాల్గొనేవారు. కొన్ని పర్యాయాలు పిల్లల కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించే వాళ్ళము. వారికి ఇష్టమయిన దీపావళి పండుగ సెలవు దినాన పిల్లలు ఆలస్యంగా మేల్కొని ఉండి రంగు రంగుల దీపాలు అలంకరించి టపాసులు కాల్చేవారు.

ప్రస్తుతము గురుకులములో ఆరు సంవత్సరాల వయస్సు వారిని చేర్చుకుని వారిని ఏడవ తరగతి వరకూ చదివిస్తున్నాము. తర్వాత వారు ఇంటికి తిరిగి వెళ్తారు. అనాథలయితే వారి భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తాము. కుమారి జ్ఞానేశ్వరీ, ఆశ్రమ పాతభక్తురాలు శ్రీమతి శేషమ్మ గారు నిజమయిన తల్లుల్లాగా ఆ బిడ్డల యోగక్షేమాల పట్ల శ్రద్ధ వహించేవారు. వారు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, సౌకర్యంగా ఉండేవిధంగా చూసుకునేవారు. విద్యార్థులకు ప్రతిరోజు మూడుసార్లు పౌష్టికమయిన ఆహారాన్ని ఏర్పాటు చేసేవారము. అలాగే ప్రత్యేకదినాల్లో తీపి పదార్థాలుండేవి. గురుకులము కేవలము వారికి విద్యనే కాకుండా ఆధ్యాత్మికంగా ఉన్నతమయిన స్థితికి ఎదగడానికి తోడ్పడేది.

**సింహాచలయాత్ర**

నిజమయిన విద్య కేవలము పుస్తకాలకే పరిమితము కారాదు. మన హృదయాలను విశాలంగా, అవగాహనతో అందరి పట్లా ప్రేమానురాగాలతో పెంచుకోవాలి. గురు కులములోని విద్యార్థులు, ఆశ్రమవాసులు అక్కడ పనిచేసేవారు అందరికి వాల్తేరు ఆశ్రమానికి వెళ్ళి నాలుగు రోజులుండి విశాఖపట్టణం చుట్టు ప్రక్కల ముఖ్యమయిన ప్రాంతాలన్నింటిని సందర్శించే సదవకాశము లభించింది. వారందరూ స్వామి జ్ఞానానందగారికి వందనాలు సమర్పించారు. ఆంధ్రా విశ్వ విద్యాలయం, వాల్తేరులోని డిపార్టుమెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌కి ఆయన అధిపతిగా ఉండేవారు. వారు విద్యార్థులను ఆశీర్వదిస్తూ మంచి మాటలు చెప్పారు.

మా విద్యార్థులందరూ ఎంతో సంతోషంగా ఓడరేవును, విమానాశ్రయాన్ని

సందర్శించారు. అక్కడి అధికారులు కూడా ప్రత్యేకమయిన శ్రద్ధతో, ప్రేమగా పిల్లలందరికీ ఓడలను, విమానాలను చూపించారు. ఆరోజు నిజంగా చాలా సుదినము. పిల్లలందరు పవిత్రమయిన సింహాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించారు. దేవాలయంలోని పూజారి చాలా దయతో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకొని దేవుని దర్శనం చేయించి, అందరికీ ప్రసాదాన్ని పంచిపెట్టారు. విద్యార్థులతో పాటు ఆశ్రమ భక్తులు చాలామందిమి ఉన్నాము. అందరికీ ఎంతో శ్రద్ధతో దర్శన ప్రసాదాలు అందించారు. ఆశ్రమానికి జీవితకాలము భక్తులుగా తరించిన డా॥జి.వి.ఎస్. మూర్తి మరియు సోదరి అమలమ్మగారి అందమయిన ఇంటిలో ఆ సాయంత్రము అందరమూ ఆనందంగా గడిపాము.

ఆదివారము ఉదయము పిల్లలు చేసిన ప్రార్థనలు, ప్రత్యేకించి భజనలు మమ్మల్ని ఎంతో ఉత్తేజితులను గావించి భగవంతుని దివ్యానుభూతిని కలిగించాయి. ప్రార్థనా మందిరము వరండా కూడా భక్తులు, స్నేహితులతో నిండిపోయింది. ప్రేమ సమాజాన్ని, దాని సెక్రటరీ శ్రీ రమణగారు చూపించిన ఆదరాభిమానాలు, విద్యార్థుల ఆశ్రమ వాసుల హృదయాలను చూరగొన్నాయి. ఆ రోజు సాయంత్రం శ్రీ రమణగారు ప్రేమ సమాజం పిల్లలందరినీ తీసుకువచ్చి స్వామీజీకి ప్రణామాలు చేయించారు. స్వామీజీ అందరినీ ఉద్దేశించి ఉత్తేజపూరితమయిన సందేశాన్ని అందించారు. శ్రీ రమణగారు పిల్లలందరికీ సినిమా వేసి చూపించారు. దాని వలన పిల్లలు ఏ విధంగా నిస్వార్థంగా సేవలు చేయాలో, పరిశుభ్రంగా ఎలా ఉండాలో, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం గర్వం లేకుండా పనిచేయటం మొదలైన పాఠాలు నేర్చుకున్నారు. భగవంతుడు ప్రేమ సమాజం చేస్తున్న మంచి పనులను ఆశీర్వదించుగాక!

మా గురుకులంలోని విద్యార్థులు సంతోషంగా, కష్టపడి పనిచేస్తున్నప్పుడు, ఆశ్రమానికి సేవలందిస్తున్నప్పుడు, దినదినము ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తున్నందుకు నాకు చాలా ఆశ్చర్యం కల్గుతుంది. ఇదంతా ఎవరు చేస్తున్నారు? అనిపిస్తుంది. అది నేను మాత్రం కాదు. ఇది అంతా పరమాత్మ చేస్తున్న పని మాత్రమే. ఆయన దివ్యానుగ్రహము చేస్తున్నది. మేమందరము ఆయన ఎన్నుకున్న పరికరాలము మాత్రమే. భక్తులకు, ఆశ్రమ సభ్యులకు, స్నేహితులకు, దగ్గరలోని వారికే కాకుండా సుదూర తీరాల్లోని వారికి కూడా శ్రీ శాంతి ఆశ్రమము అనేక ధన్యవాదాలు తెలియ చేసుకుంటోంది. ఎందరో దాతలు ముందుకు వచ్చి కేవలము వారి ధనాన్ని మాత్రమే కాకుండా వారి ప్రేమ, దయ, ప్రార్థనలు, సేవలు అందించి ఆదర్శవంతమయిన గురుకులాన్ని ప్రయోగాత్మకంగా నడిపించాలనే నా కలను సాకారం చేశారు.



# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**తదా సభాసదాః సర్వే నృపతిం వాక్యమబ్రువన్ ।**
**మా కార్యః కలహోరాజన్ పశ్యాస్యా కిం ను వర్తతే ॥ 266**

**తాం తదోద్ఘాటయామాస దూతైర్నృపతిసత్తమః ।**
**తస్యాం దృష్ట్వాబాలికాం తు విస్మయం ప్రాప పార్థివః॥ 267**

**ద్విజస్యక్త్వాయయౌ గేహం పాలయామాస తాం నృపః।**
**తదా ఖేచరవాద్యాని నేదుః కుసుమవృష్టిభిః ॥ 268**

**వవర్షుః సురసంఘాశ్చ తాం కన్యాం జనకం నృపమ్ ।**
**గంధర్వా గాయనం చక్రుః ననృతుశ్చాప్సరోగణాః॥ 269**

**తదా మేనే నిజాం కన్యాం జనకస్తోషమాప సః ।**
**జాతకం కారయామాస విప్రైస్తస్యాః సవిస్తరమ్॥ 270**

**దదౌ దానాని విప్రేభ్యో ననృతుర్వారయోషితః।**
**మాతులుంగాన్నిర్గతా యా మాతులింగీతి సా స్మృతా॥ 271**

**అగ్నివాసాదగ్నిగర్భా తథా రత్నావలీతి చ ।**
**రత్నాంతరనివాసాచ్చ ప్రోచ్యతే జగతీతలే॥ 272**

**ధరణ్యా నిర్గతా యస్మాత్ తస్మాద్ధరణిజేతి చ ।**
**జనకేనావితా యస్మాజ్జానకీతి ప్రకీర్త్యతే॥ 273**

**సీరాగ్రాన్నిర్గతా యస్మాత్ సీతేత్యత్ర ప్రగీయతే।**
**పద్మాక్షనృపతేః కన్యా తస్మాత్పద్మేతి సా స్మృతా॥ 274**

**ఏవం నామాన్యనంతాని సీతాయాః సంతి భో నృప।**
**ఆకాశనీలవర్ణాభ వపుషాఽనేన జానకీ॥ 275**

రాజు ఆ పెట్టెను స్వీకరించెను. అప్పుడు దేవవాద్యములు మ్రోగెను. అప్సరసలాడిరి, గంధర్వులు పాడిరి. జనకునిపై, కన్యారత్నముపై దేవతలు పూలవాన కురిపించిరి. అంత జనకమహారాజు తన పుత్రికయని యా బ్రాహ్మణులచే జాతకములను వ్రాయించి, దానధర్మములను ఒనరించెను. కనుక, ఆమె 'మాతులుంగమునుండి వెలువడినందున 'మాతులింగి' యనబడును. 'అగ్నిలో

వాసము చేసినందున 'అగ్నిగర్భ' యనబడును. రత్నపు పెట్టెలో ఉండినందువలన 'రత్నావతి' యని పిలువబడును. భూమినుండి వచ్చినందున 'భూపుత్రి' యని పేరు గాంచెను. జనకునిచే సంరక్షింపబడినందువలన 'జానకీ' అను పేరుగాంచినది. నాగలి మొనకుతగిలి వెలువడినందున 'సీత'యని ఖ్యాతి జెందినది. పద్మాక్షరాజ పుత్రిగాన 'పద్మ'యని స్మరింపబడును. ఇట్లు అనేకనామములు సీతాదేవికి గలవు. 'ఓ దశరథుడా! ఆకాశనీలవర్ణుడగు నీ రామునికి సీత యిప్పుడు లభించినది. ఇప్పుడు పద్మాక్షుని ప్రతిజ్ఞ సఫలమయ్యె. నీవడిగిన సంగతిని తెలిపితిని. ఇక నలుగురు కోడండ్రనంది ఆనందింపుము' అని శతానందుడు చెప్పుచుండునప్పటికి దశరథరాజుచే పిలువనంపబడియుండిన దశరథుని మామలు కోసలరాజు, మగధరాజు, కేకయరాజును, సపుత్ర మిత్ర పరివారము వచ్చి చేరిరి. జనకుడు సంతోషముతో వారినందరిని స్వాగతసల్లాపాదికముచే సన్మానించెను. అంత జనకుడు దశరథుని పూజించి రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను దివ్యాభరణాదుల చేత అలంకృతులనుజేసి, మహోత్సవములతో అయోధ్య నగరమునకు పిలుచుకొని పోయినపుడు, (270) శ్రీరాముడు దశరథునికి నమస్కరించి, పలుమార్లు సమాలింగితుడై, వశిష్ఠ, విశ్వామిత్రులకు నమస్కారముజేసి, కౌసల్యాదులగు తల్లులకు ప్రణామములు జేసి, దశరథుని ముందర ఆ స్త్రీలతోను బంధువులతోను ముందు నడచెను. మంగళవాద్యములు మ్రోగుచుండగా వందిమాగధులు నమస్కరించు చుండగా ఆ శ్రీరామ ప్రభువు నగరమును ప్రవేశించెను. అంత అత్యంత సంభ్రమముతో అచ్చటి పురస్త్రీలంతా నగర గోపురాదులమీద పరుగులిడుచు నడుములమీద బిడ్డలనిడుకొని, తమతమ పనులనువిడిచి, మిక్కిలి కుతూహలముతో శ్రీరాముని దర్శించుకొనుచుండిరి. రాజమార్గమున వచ్చుచున్న రామునిమీద రాచకన్యలంతా కుసుమవర్షము కురిపించిరి. (275)

**లబ్ధా రామేణ పద్మాక్షప్రతిజ్ఞా సఫలీకృతా ।**
**ఏవం త్వయా యథా పృష్టం తథా త్వాం వినివేదితమ్॥ 276**

**చతస్రస్త్వం స్నుషాస్త్వత్ర కర్తుమర్హసి భో నృప**

**శ్రీ శివ ఉవాచ**
**ఏతస్మిన్నంతరే తత్ర పూర్వం దశరథేన చ॥ 277**



**సమాహూతా యయుః సైన్యైః స్త్రీపుత్రైః శ్వశురాశ్చ తే।**
**కోసలో మాగధేశశ్చ కైకేయశ్చ యుధాజితః॥ 278**

**మానయామాస తాన్ రాజా జనకోపి ముదాన్వితః ।**
**తతో దశరథం పూజ్య శ్రీరామం లక్ష్మణం తథా॥ 279**

**భరతం చాపి శత్రుఘ్నం సంపూజ్యాభరణాదిభిః ।**
**నినాయ జనకస్తుష్టః స్వపురీంపరమోత్సవైః॥ 280**

**తదా రామో నృపం నత్వా రాజ్ఞా చాలింగితో ముహుః ।**
**వసిష్ఠం గాధిజం నత్వా కౌసల్యాది ప్రణమ్యచ॥ 281**

**రాజ్ఞో దశరథస్యాగ్రే తైః స్త్రీభిర్బంధుభిః సహ ।**
**గజారూఢో యయావగ్రే తేప్యఽభూవన్ గజస్థితాః॥ 282**

**నదత్సు వాద్యసంఘేషు స్తువత్సు మాగధాదిషు ।**
**నర్తత్సు వారనారీషు వివేశ నగరీంప్రభుః॥ 283**

**తదాఽఽసీత్సంభ్రమః పౌరస్త్రీణాంశ్రీరామదర్శనే ।**
**విసృజ్య స్వీయకృత్యాని దుద్రువుర్గోపురాదిషు॥ 284**

**కట్యాం నిధాయబాలంశ్చ దదృశూ రఘునందనమ్ ।**
**రాజమార్గగతం రామం వవర్షుః పుష్పవృష్టిభిః॥ 285**

**ఏవంమహోత్సవైర్వ్యాసస్థలం దశరథః సుతైః ।**
**యయౌ వస్త్రాన్నతోయాద్యైః పరిపూర్ణం మనోరమమ్॥ 286**

**కృత్వా జ్యోతిర్విదా లగ్నదివసస్య వినిశ్చయమ్ ।**
**మంటపాంశ్చ తోరణాని పతాకాశ్చ ధ్వజాంస్తథా॥ 287**

**రోపయామాసుః సర్వత్ర మంత్రిణో మిథిలాం పురీమ్ ।**
**మార్గాశ్చందనలిప్తాశ్చ పుష్పైరాచ్ఛాదితా అపి ॥ 288**

**మాలాభిస్తోరణైః పుష్పఘోషాద్యైస్తే చకాశిరే ।**
**తతో ముహూర్తసమయే వధూచ్ఛిష్టాం నిశాం శుభామ్॥ 289**

**సుతైలాఢ్యాం స్త్రియః సర్వాః కౌసల్యాద్యాస్తు మాతరః ।**
**రామాదీన్ పరిలిప్యాదౌ నీరాజనపురస్సరమ్ ॥ 290**

ఇట్లు మహోత్సవములతో దశరథమహారాజు వచ్చి, ఆనందముగా అలంకార

శోభితమైన అంతఃపురమున సర్వసత్కారములతో ప్రవేశించెను. మంత్రులు, దైవజ్ఞుల వలన వివాహలగ్న నిశ్చయము చేయించి, మంటపములతోను, తోరణములతోను, పతాకములతోను, ధ్వజములతోను, మిథిలా పట్టణమును సుందరముగా అలంకరింపజేసిరి. రాజవీధులన్నీ చందనముతో కళ్ళాపు చల్లించిరి. పూల మాలలను వ్రేలాడదీయించిరి. పిమ్మట ఆకాశమున వెన్నెల పరుచుకున్న వేళ కౌసల్యాది తల్లులును, తక్కిన వృద్ధ సువాసినులు, రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను మొదట దివ్యపీఠములమీద గూర్చుండబెట్టి, పాటలుపాడి, మంగళహారతులనెత్తి...(290)

**కరకుంభాంస్తోయపూర్ణాం చతుర్దిక్షు సదీపకాన్ ।**
**సంస్థాప్యస్నాపయామాసుః మహావాద్యపురస్సరమ్ ॥** **291**

**తదాభ్యంగం స్వయం చాపి కృత్వా సస్నుశ్చ మాతరః।**
**రామాదీన్పురతః కృత్వా వస్త్రాలంకారభూషితాః ॥** **292**

**అభ్యంగపూర్వకం సస్నౌ రాజా దశరథోఽపి సః ।**
**సమాహూయ నృపస్త్రీశ్చ సభాయాం స్వస్తికే గురుః ॥** **293**

**ముక్తావినిర్మితే రాజ్ఞః పార్శ్వే వామే న్యవేశయత్ ।**
**అగ్రే రామాదికాన్కృత్వా తాః స్త్రియోఽవనతాననాః ॥** **294**

**హరిద్రాకుంకుమాలిప్తచరణా రేజిరేంగణే ।**
**వసిష్ఠో బ్రాహ్మణైర్యుక్తో రాజ్ఞా రామాదిభిర్ముదా ॥** **295**

**కృత్వా గణపతేః పూజాం పుణ్యాహాదిత్రయం క్రమాత్ ।**
**కారయామాస విధివత్ ప్రతిష్ఠాం దేవకస్య చ ॥** **296**

**గ్రామాచారం కులాచారం వృద్ధాచారం తథాపునః ।**
**దేశాచారం చ ప్రమదాచారదీనకరోన్నృపః ॥** **297**

**తోయకుంభం మంటపాదికానాం పూజనమాచరత్ ।**
**కౌసల్యాద్యాః స్త్రియః సర్వా హరిత్పీతారుణైర్వరైః ॥** **298**

**హేమతంత్వర్చితైర్వస్త్రైః విరేజుర్మంటపాంగణే ।**
**జనకశ్చ నృపైర్యుక్తో మహావాద్యపురస్సరమ్ ॥** **299**

**రామాదీన్స్వ నిజం గేహం నేతుకామస్సయాయయౌ ।**
**మంటపే పూజయామాస రామాదీన్ జనకస్తదా ॥** **300**



మంగళవాద్యముల, మంగళఘోషములతోడ అభ్యంగ విధానము ఒనరించిరి. నాలుగు దిక్కులలోను దీపములతోడ పూర్ణకుంభములను సంస్థాపించిరి. మంగళ విధానముతో రామాదులకు అభ్యంగస్నానము చేయించిరి. ఆ స్త్రీలందరును తాము కూడా వస్త్రాలంకారభూషితులై అభ్యంగన మంగళ స్నానములను చేసికొనిరి. దశరథ మహారాజును అభ్యంగస్నానమును చేసికొనెను. అంత వశిష్ఠ మునులును, రాణులను పిలిపించి, మణులచే అలంకరింపబడిన స్వస్తిమంటపమున దశరథమహారాజుకు యెడమభాగమును కూర్చుండబెట్టి, వారిముందర రామాదులకు శోభాయమానముగ బ్రాహ్మణులతోడ స్వస్తివాచనమునకు ఆరంభించిరి. అక్కడి స్త్రీలు వివిధ అలంకారము లతో, పసుపు కుంకుమలచే అలంకరించుకుని రాజిల్లుచుండిరి. (295) వశిష్ఠముని మొదట శ్రీమహాగణపతిని అర్చించి, పుణ్యాహాదికాలను క్రమముగా ఆచరించి, విధిప్రకారముగా కులదేవతా ప్రతిష్ఠను గావించెను. దశరథుడు– గ్రామాచారములను, కులాచారములను, దేశాచారములను, వృద్ధాచారములను, సువాసిని ఆచారములను నెరవేర్చి, పూర్ణకుంభములతో మంటపాదుల పూజనము ఒనరించెను.

ఈ జీవితం ఎంతకాలం ఉంటుంది? ఈ ప్రపంచంలోకి వచ్చావు కనుక దానిమీద ఏదోఒక గుర్తును ముద్రించి వెళ్ళు, లేకపోతే నీకు, చెట్టుచేమలు, రాయి రప్పల మధ్య తారతమ్యం ఏముంటుంది? అవి కూడా పుట్టి, కృశించి చనిపోతాయి. **– స్వామి వివేకానంద**

వినయం లేని విద్యా, సుగుణం లేని రూపం, ఉపయోగం కాని ధనం, శౌర్యంలేని ఆయుధం, ఆకలిలేని భోజనం, పరోపకారం చేయని జీవితం వ్యర్థం. **– స్వామి వివేకానంద**

రోజుకు ఒక్కసారైన మీతో మీరు మాట్లాడుకోండి. లేకపోతే ఒక అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని కోల్పోతారు. **– స్వామి వివేకానంద**

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీన పరిచే ఆలోచనను తిరస్కరించండి. **– స్వామి వివేకానంద**

సంకల్పశక్తి శక్తులన్నిటికన్నా బలవత్తరమైనది. అది సాక్షాత్తు భగవంతుని వద్ద నుండి వచ్చేది కాబట్టి దానిముందు తక్కినదంతా వీగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన సంకల్పం సర్వశక్తివంతమైనవి. **– స్వామి వివేకానంద**

# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

(గత సంచిక తరువాయి) **దుఃఖనివృత్తి**

**జీవుడు జన్మదుఃఖము నందు చిక్కితినని ఎడి భ్రాంతితో మనోవ్యధకులోనై, తీవ్ర అసంతృప్తి కారణముగా క్రుంగి పోవుచుండును. 'నేను' అనెడి అహంత నశించగా, అతడు (జీవుడు) తన సత్ స్వరూపము పరమానుగ్రహరూపమున నుండెడి బ్రహ్మస్వరూపమని అనుభవగోచము కావించు కొనవలెను. అతనిని పాలించెడి ఉన్నత శక్తి అదే. జీవుడు తన మనోవ్యథను అంతము జేసికొని, పరమానందమును అనుభవించుటకు ఇదే ఏకైకమగు ఉపాయము.**

జీవుడు తనకు దుఃఖము కలుగు తున్నదని అనుకుంటూ ఉంటాడు. ఈ దుఃఖము సహజమయినదికాదు. మధ్యలో వచ్చినది. అని విచారణ ద్వారా తెలుసుకోవాలి. ఈ జన్మపరంపరలో చిక్కి దుఃఖాన్ని అనుభవించుట అనేది భ్రాంతి మాత్రమే. అది నీ నిజస్వరూపముకాదు. మన నిజస్వరూపము తెలుసుకోవాలంటే మనల్ని మనం బాగా విచారణ చేయాలి. ఇది గుర్వనుగ్రహము ద్వారానే కలుగుతుంది. గుర్వనుగ్రహము లేకుండా జ్ఞానము కలిగే అవకాశమే లేదు. గురువు లేకుండా నేర్చుకున్న విద్యగుడ్డి విద్య అని మహాత్ములు అంటారు. ఒకదాని మీద గురికుదరడమే గురువు. దేనిమీద గురి కుదురుతుందో దానిని శ్రద్ధావిశ్వాసాలతో ఆరాధిస్తే ఫలితం కలుగుతుంది. దత్తాత్రేయుడు తను చూసిన ఇరవైనాలుగు తత్త్వాలనుండి తలాఒక విషయం నేర్చుకున్నారు. మనకు తెలియని విషయాలను మనకు తెలియజేసే వారందరూ గురువులే. దుఃఖ నివృత్తి కావడానికి మనకు గురువు అవసరం. శాస్త్రముల, గ్రంధముల ద్వారా, మానవ గురువుద్వారా, ప్రకృతిద్వారా, పంచభూతాల నుండి విషయాలను గ్రహించి మన దుఃఖాన్ని పోగొట్టుకోవాలి. దానికి గురువు అవసరము. దుఃఖమునకు కారణము, ఆ కారణము ఎలా పోతుందో తెలుసుకొని సాధన చేయాలి, గురుబోధ వలన దుఃఖమనేది భ్రాంతి అనిపిస్తుంది. మనస్సు, శరీరముతో ఏకమై, మనస్సే తానని మనుష్యుడు దుఃఖపడుతున్నాడు. నిజానికి అతడు ఆత్మ స్వరూపుడు. తాను శరీరము అనుకోవడమూ భ్రాంతి, అజ్ఞానము. ఏదో ఒక రకముగా ఈ భ్రాంతినుండి బయటపడి తన దుఃఖానికి నివారణనను తెలుసుకుంటాడు. తన స్వరూపము బ్రహ్మస్వరూపమని, సచ్చిదానంద స్వరూపమని, జ్ఞాన స్వరూపమనే భ్రాంతిని పొందుతాము. భగవంతుని శరణాగతి చెందకుండా ఆధ్యాత్మిక మార్గములో ఒక్క



అడుగు కూడ ముందుకు వేయలేరు. భక్తి, సాధన, జ్ఞానము, గురువు అనుగ్రహము వలన మనోవ్యధను అంతం చేసుకోవాలి, పరమానందము అనుభవించేవారికి ఇదంతా భ్రాంతి అని తెలుస్తుంది. మనకు భ్రాంతి తొలగకముందు, తొలిగిన తరువాత కూడ ఇది రక్తమాంసములతో కూడిన శరీరమే. విషయము తెలిసినపుడు భ్రాంతి చెందడం మానుతాడు. వేదాంతము ఏ విషయాన్ని కొత్తగా ఏమీ చెప్పదు. ఉన్న విషయాన్నే మాటిమాటికి చెబుతుంది. గురువు ఉన్న విషయము యొక్క వెనకాల ఉన్న సత్యాన్ని చెప్పి మన భ్రాంతిని తొలగిస్తారు.

**నీవు (ఆత్మను) తత్త్వమును సాక్షాత్కరింప జేసుకోవలయును. ఆత్మను విస్మరించిన యెడల ఈ జగన్మాయ శక్తిమంతమయి, భ్రాంతికరమయి, నిన్ను మోహబద్ధుని జేయును. కనుక ఆత్మను తెలిసికొనిన యెడల సంపూర్ణ దుఃఖనివృత్తికి లేశమాత్రమయినను అవకాశము లేదు.**

నీవు ఆత్మానుభవం పొందితేనే సంపూర్ణ దుఃఖ నివృత్తి జరుగుతుంది. తాత్కాలిక ఉపశమనము వలన దుఃఖము పూర్తిగా పోదు. నిన్ను నీవు విచారణ చేసుకొని, గురు బోధచేత ఆత్మానుభవం పొందితే తప్ప ఈ దుఃఖము శాశ్వతముగా నివృత్తికాదు. దుఃఖానికి కారణమయిన అజ్ఞానాన్ని నశింపచేసుకొని దుఃఖనివృత్తిని పొందాలి.

**దారా పుత్రాదుల మరణము కారణముగా దుఃఖతృప్తుడై విలపించెడి వ్యక్తి, మొదట తనలోతాను విచారణ చేసి, తన యొక్క సత్యస్థితి ఏమిటో యెఱిగి స్వస్వరూపమును సిద్ధింపజేసి కోవలయును. దీనిని సాధించిన తరువాత, ఆత్మ విచారఫలముగా నశించిన దేహాహంత యొక్క మరణమును గూర్చి విలపించినచో, అతని తొలుతటి విలాపమునకు కారణమయిన మనోవ్యధ యావత్తు పూర్తిగా నశించిపోవును.**

భార్య, బిడ్డ, సమీపబంధువుల మరణం ద్వారా బాధ కలుగుతుంది. గురువు ఇది సహజమని నీకు కూడా ఇది సంభవిస్తుందని చెబుతారు. తన చనిపోయిన బిడ్డను బ్రతికించమనిన తల్లితో, మరణములేని ఇంటినుండి నువ్వులు తెమ్మని బుద్ధుడు చెబుతాడు. ప్రతి ఇంట మరణము సహజమని, ఆ తల్లి తెలుసుకుంటుంది. పుట్టిన వారు మరణించటం సహజమని, దానికి దుఃఖపడకూడదని బుద్ధుడు ఆ తల్లికి బోధించి జ్ఞానోదయం చేస్తాడు. మనం మన అజ్ఞానంతో వాస్తవాన్ని గ్రహించము. గురువులు భ్రమను తొలగించి, అసలు వాస్తవాన్ని చెబుతారు. గురుబోధతో తన సత్యస్థితిని తెలుసు కొని, తనలోతాను విచారణ చేసుకుంటే,

ఆత్మ విచారణ ఫలితంగా దేహభ్రాంతి పోతుంది. అప్పుడు దుఃఖం తొలగిపోతుంది. నేను ఆత్మ స్వరూపుడను, సచ్చిదానంద స్వరూపుడను అనే విషయం మరచి పోవడం వలన దుఃఖం కలుగుతుంది. ఈ మరచిపోయిన విషయాన్ని గురువులు, శాస్త్రాలు గుర్తు చేస్తాయి తప్ప కొత్తగా ఏ విషయమూ చెప్పడములేదు. ఎప్పుడయితే అహంకారము నశిస్తుందో, దుఃఖమునశించి, హాయిగా ఆనందంగా గడుపుతావు. ఒక వ్యక్తి మరణిస్తే అది బ్రతికి ఉన్న వానికి దుఃఖమును కలిగిస్తుంది. దుఃఖించెడిది అహం. అహంకారము నాశనము చేసిన దుఃఖపడువారెవ్వరు ఉండరు. ఈ శరీర భ్రాంతిని వదలినప్పుడే హాయిగా ఆనందముగా ఉందుము.

**శరీరస్థుడైయున్న ఒక వ్యక్తిగా భావించి, నీవు ఒక జీవుని ప్రేమించినచో, ఆ వ్యక్తి మరణించినప్పుడు దుఃఖము తప్పక కలుగును. ఈ దుఃఖము పూర్తిగా నశించి పోవలయునన్నచో, దుఃఖరహితమగు సత్య ప్రేమను నిరంతరము అభ్యసింపుము. దానికై జీవుని సత్‌స్వరూపము ఆత్మయే అని యెఱిగి, ఆత్మ స్వరూపముగానే ఆ జీవుని చూడుము, ప్రేమించుము.**

మన సన్నిహితులు పోయినపుడు వారితో మన అనుబంధమును తలచుకొని చాలా బాధపడతాము. మనకు మనం ఈ శరీరమే అనెడి భ్రాంతి వలన ఈ దుఃఖము కలుగుతుంది. భగవాన్ ఇలా అంటున్నారు. ఈ జీవులను శరీరాలుగా చూడవద్దు. వారిని ఆత్మ స్వరూపులుగా చూడు. ఆత్మకు చావుపుట్టుకలు లేవు. ఒక రూపం వచ్చి, పోయింది. ఇటువంటి భావన చేస్తే దుఃఖము ఉండదు. ముందుగా మనకి మనం ఈ శరీరము కామనే భావన చేస్తే, అందరినీ ఆత్మ స్వరూపులుగా చూడగలము. ముందు మనకు ఈ దేహము నేను కాదు నేను ఆత్మను అనే దృఢమయిన నిశ్చయమే కాకుండ అనుభవం కూడ కలగాలి. ఈ ధృఢ నిశ్చయం కలిగితే ఏ వ్యక్తులు దూరమయినా, దగ్గరయినా, ఏ సంఘటన అయినా మనలను బాధించదు. మనము ప్రశాంతముగా ఉండ గలము. ప్రతీ జీవిని వ్యక్తులుగా కాకుండ ఆత్మస్వరూపులుగా చూడాలి.

**హరి ఓం తత్సత్.**

లౌకిక సుఖాలే మనగమ్యమై, వాటిని పొందేందుకు భగవంతుని ఆశ్రయిస్తే అదింకా ప్రపంచ కలే. కాని భగవంతుడనే గమ్యాన్ని చేరేందుకై ఈ లోకం ఒక సాధనమైతే అది ఆధ్యాత్మికతకు నాంది.

**– స్వామి వివేకానంద**



## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం -10

**(జనవరి సంచిక తరువాయి)** **వాఖ్యాత – వింజమూరి రాధాకృష్ణ**

దక్షిణామూర్తి స్తోత్రములోని రెండవ శ్లోకానికి ఆదిశంకరుల ప్రథమ శిష్యుడైన శ్రీసురేశ్వరాచార్యులు వ్రాసిన మానసోల్లాసం వార్తికలోని 56 శ్లోకాలలో గత నెల శాంతిపత్రికలో 5 శ్లోకాలు పరిశీలించాము. ఇవన్నీ శంకరులు ప్రతిపాదించిన అద్వైతాత్మక సృష్టి వాదానికి కణాదులు చేసిన పూర్వపక్ష సిద్ధాంతము. మరి మూడు శ్లోకాలలో ఈ వాదన కొనసాగినది. అది ఎట్లు జరిగినది పరిశీలిద్దాం.

**6. మృత్తికాయాం ఘటస్తంతా పటః స్వర్ణే ఉ_ంగు ళీయకమ్ ఉ_**
**ఇతి వైశేషికాః ప్రాహు స్తథా నైయ్యాయికా అపి**

మృత్తికాయాం=మట్టిలో, ఘటః=కుండ, తంతౌ=దారములో, పటః=బట్ట, సువర్ణే=బంగారములో, అంగుళీయకం= ఉంగరము, ఇతి= ఇమిడి ఉన్నవి అని, వైశేషికాః=వైశేషిక సిద్ధాంతకారులు, తథా = అట్లే, నైయ్యాయికాః=నైయ్యాయిక సిద్ధాంతకారులు, అపి=కూడా, ప్రాహుః= చెప్పుచున్నారు.

వైశేషికులు కుండలో మట్టి, బట్టలో దారము, ఉంగరములో బంగారము ఎట్లు ఇమిడి ఉన్నవో అట్లే ఈ విశ్వంలో వాటి, (పంచభూతముల) మూల పదార్థముల పరమాణువులు ఇమిడి ఉన్నాయి అందురు. న్యాయ సిద్ధాంతము నమ్మువారు కూడా ఇట్లే చెప్పుచున్నారు.

**7. రజస్సత్వం తమశ్చేతి ప్రధానస్య గుణాస్త్రయః**
**రజో రక్తం చలం శేషు సత్త్వం శుక్లం ప్రకాశమ్**

ప్రధానస్య=ప్రకృతి యొక్క, గుణాః=గుణములు, రజః=రజస్సు, సత్వం= సత్వము, చ=మరియు, తమః=తమస్సు, ఇతి=అది ఇట్లు, త్రయః=మూడు, శేషు= వానిలో, రజః=రజస్సు, రక్తం=ఎర్రని రంగు కలది, చలం=చలనశీలమైనది, సత్వం= సత్వము, శుక్లం=తెల్లనిది, ప్రకాశకం=ఎదుట ఉన్న వస్తువులను తెలియపరుచునది.

తమస్సు, రజస్సు, సత్వము ఈ మూడు గుణములు ప్రకృతి యొక్క సహజ గుణములు. వీనిలో తమస్సు నల్లనిది. ఇది వస్తువులను కనబడకుండా చేయు

గుణము కలిగి ఉన్నది. రజస్సు ఎర్రనిది, ఇది చలనశీలమైనది. సత్త్వము తెల్లనిది. ఇది వస్తువులు ప్రకాశించునట్లు చేయును.

**8. తమఃకృష్ణం చావరకం సృష్టిస్థిత్యంతహేతవః**
**ఇతి సాంఖ్యాశ్చ భాషంతే తేషాం దూషణముచ్యతే**

తమః= తమస్సు, కృష్ణం=నల్లనిది, చ=మరియు, అవరకం= వస్తువులను కనిపించకుండా చేయు గుణము కలది, సృష్టి స్థిత్యంతహేతువః=సృష్టి స్థితి లయలకు కారకములు, ఇతి=అని, సాంఖ్యా=సాంఖ్యులు భాషంతే=చెప్పుచున్నారు. తేషాం= వారి మతములను, (న్యాయ, వైశేషికా, సాంఖ్యమతముల వారి భావములను), దూషణం= ఖండించుటను, ఉచ్యతే=చెప్పబడుచున్నది.

తమస్సు నల్లనిది మరియు అది వస్తువులను కనబడకుండా చేయు లక్షణము గలది. సృష్టి, స్థితి, లయలకు ఈ సత్త్వ రజో తమో గుణములే ప్రధాన కారణమని సాంఖ్యులు, వైశేషికులు నయ్యాయికులు భావింతురు. ఈ మతముల ఖండన ఇప్పుడు చెప్పబడుచున్నది.

**9. అంకురాదిష్ఫలాంతేషు కార్యేష్వస్తిత్వమిష్యతే**
**కుత ఆగత్య సంబద్ధా వటబీజేషు తే కణాః**

అంకురాది ఫలాంతేషు=మొలక నుండి ప్రారంభమై పండు వరకు గల, కార్యేషు= కార్యములయందు, అస్తిత్వం = ఉండుట, ఇష్యతే=అంగీకరింపబడినది. వటబీజేషు=మర్రి విత్తనముల యందు, తే=ఆ, కణాః=పరమాణువులు, కుతః= ఎక్కడినుండి, ఆగత్య=వచ్చి సంబంద్ధా=వచ్చి చేరినవి?

మొలకనుండి పండు వరకు జరుగు మార్పుల యందు ప్రతి ఒక్క అవస్థలోను విత్తనము లోపల జరుగు ఉనికిని అందరూ అంగీకరించి తీరవలసినదే. అట్టిస్థితిలో పరమాణువులు ఎక్కడ నుండి వచ్చి మర్రి విత్తనములో చేరినవి. అటుల జరిగిననూ పరమాణువులు చేరుటకు కారణమేమై ఉండును? అను ప్రశ్న ఉత్పన్నమగును. దీనికి సమాధానం మౌనమే.

**10. కారాణానుగతం కార్యం ఇతి త్సర్వైశ్చసమ్మతమ్**
**తస్మాత్సత్తాస్పురత్తా చ సర్వత్రాప్యనువర్తతే**

కార్యం=కార్యము, కారాణానుగతం= కారణము వెంటనంటియుండును. ఇతి=అని సర్వైశ్చ=ఎల్లారచేతను, సమ్మతం=అంగీకరింపబడియున్నది, తస్మాత్= అందువలన, సత్తా=ఉనికిని, చ=మరియు, స్పురత్తా=ప్రకాశం, సర్వత్ర అపి= అన్ని ప్రదేశములలోనూ అన్ని వస్తువుల యందును, అనువర్తతే=కలసి ఉన్నది.

కార్యము కారణముతో చేరియుండునని అందరూ అంగీకరింతురు. అందువలననే ఉనికి ప్రకాశము అన్ని వస్తువులలోనూ అన్ని వేళలయందు చేరియున్నవి.

**11. పుష్పే ఫలత్వమాపన్నే క్షీరే చ దధిత్తాం గతే**
**విజాతీయా ప్రతీయంతే గుణరూపరసాదయః**

పుష్పే=పూవు, ఫలత్వం=పండెడి స్థితి, ఆపన్నే=పొందగానే, చ=మరియూ, క్షీరే=పాలు, దధితాం=పెరుగుగా, గతే=పొందగా, రూపరసాదయః=రూపము, రసము మొదలయిన, గుణాః=గుణములు, విజాతీయాః=విజాతీయములై పూర్వగుణముల కంటే వేరై, ప్రతీయంతే=కన్పడుచున్నవి.

పువ్వు పండుగా మారినప్పుడు గాని పాలు పెరుగుగా మారినప్పుడు గాని వానిలో కనబడు రూప రసాదిగుణముల పూర్వపు స్థితిలో కాక వేరుగా ఉండుట గమనింతుము. సాధారణంగా కార్యములోనున్న లక్షణములే కారణములోను ఉండునని అందరూ అంగీకరించినది. ఉదాహరణకు ఎర్రని దారముతో నేసిన బట్ట ఎరుపు గానే ఉండును. అట్లే పువ్వు పండుగా మారినప్పుడు గానీ లేక పాలు పెరుగుగా మారినపుడు గానీ అవి పూర్తి విరుద్ధముగా నుండును. అందుచే సృష్టి కార్యములో జరిగిన పంచీకరణము సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మకి మాత్రమే సాధ్యము. ఈ కారణమునే శంకరులు సృష్టి గూర్చి **మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యఃస్వేచ్ఛయా** అన్నారు.

**12. కారణం కార్యమంశోஉంశీ జాతివ్యక్తీ గుణీ గుణః**
**క్రియా క్రియావానిత్యాదద్యాః ప్రకాశస్యేవ కల్పనా**

కారణం=కారణము, కార్యం=కార్యము, అంశః=అందలి ఒక భాగము, అంశీ= భాగము గలది, జాతివ్యక్తీ=జాతి, వ్యక్తి, గుణీ= గుణముగలది, గుణః= గుణము, క్రియా=పని, క్రియావాన్=పనిగలది, ఇత్యాద్యాః=ఇత్యాదులు, ప్రకాశస్య= ఒక్కటి అయిన, ప్రకాశస్యేవ= ప్రకాశము యొక్క కల్పన మాత్రమే.

కారణము కార్యము అంశ అంశి జాతి వ్యక్తి గుణము గుణిక్రియ క్రియగలది ఇత్యాదులన్నీ అద్వితీయమైన ప్రకాశమునకు మాత్రమే సాధ్యమైన మాయాకల్పనలు.

**13. చైతన్యం పరమాణూనాం ప్రధానస్యాపి నేష్యత్యతే**
**జ్ఞానక్రియే జగత్ క్లుప్తౌ దృశ్యేతే చేతనాశ్రయే**

జగత్ క్లుప్తౌ=జగత్ నిర్మాణ కార్యక్రమములో, పరమాణునామ్= పరమాణువులు, అపి= మరియు లేక ప్రధానస్య = ప్రకృతి యొక్క చైతన్యం= జ్ఞానము యొక్క లక్షణముగా ఉండుటచే, న ఇష్యతే=అంగీకరింపబడదు, జ్ఞానక్రియే= జ్ఞాన క్రియలు, చేతనాశ్రయే=చేతనమును ఆశ్రయించినట్లు, దృశ్యతే= చూపబడుచున్నవి.

జగన్నిర్మాణ కార్యక్రమంలో పరమాణువులకు లేదా ప్రకృతికి చైతన్యము లేదు. అవి కేవలము జడము మాత్రమే, అట్టి స్థితిలో జ్ఞానకర్మలు చేతనమును ఆశ్రయించి ఉన్నట్లు కనిపించును. అందుచే ఈశ్వరుడు మాత్రమే సృష్టిక్రియను జరుపగలడు. సత్వరజస్ తమోగుణములు చైతన్యముతో కూడిన సృష్టిని జరుపలేవని నిర్ధారణ అయినది.

**14. కాల రూప క్రియాశక్త్యా క్షీరాత్పరిణమేద్దధి**
**జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ జ్ఞాన శక్త్య భవేజగత్**

కాలరూప క్రియాశక్త్యా=కాలరూపములుగా ఉన్న ఈశ్వర శక్తిచే, క్షీరాత్= పాలనుండి, దధి=పెరుగుగా, పరిణమేత్= పరిణామము చెందును, జ్ఞానశక్తి= ఈశ్వర జ్ఞాన శక్తిచే, జ్ఞాతృజ్ఞానజ్ఞేయ=రూపం తెలియువాడు, తెలివి, తెలియదగినది అను రూపములు గల, జగత్=ప్రపంచము అగును.

కాలము రూపము అగు ఈశ్వరక్రియాశక్తిచే పాలు పెరుగుగా మారును. ఈశ్వర జ్ఞానశక్తిచే జ్ఞాత జ్ఞానము జ్ఞేయరూపం గల ప్రపంచముగా మారును.

స్వాధీనంలో లేకుండా పెడత్రోవన పట్టిన మనస్సు మరింత కిందకు దిగజార్చి నాశనం చేస్తుంది. స్వాధీనంలో ఉండి, సరైన త్రోవ చూపెట్టిన మనస్సు మనల్ని రక్షిస్తుంది, ముక్తిని ప్రసాదిస్తుంది. **– స్వామి వివేకానంద**

వికాసమే జీవితం, సంకుచితత్వమే మరణం. ప్రేమే జీవితం, ద్వేషమే మరణం.
**– స్వామి వివేకానంద**



## వివేకం

**జీవితం విశాలం**
**సమయం పరిమితం**
**ఈ పరిమితంలోనే సాధించాలి**
**కాలాన్ని వివాదాలతో**
**దుర్వినియోగం కానీయరాదు**
**ఒక విషయాన్ని ప్రాణంతో**
**సమానంగా ఆలోచించాలి**
**అప్పుడు పడే అడుగులు**
**వివేకంగా దర్శనమిస్తాయి**

**మలిశెట్టి శ్రీనువాస రంగారావు**
**(బన్ను)**
**సెల్: 99084 84132**

మానవజాతి వెనుకనున్న అపారశక్తి, జ్ఞానం ప్రతిమనిషికి చెందుతాయి.
**– భగవాన్‌రమణ మహర్షి**

నిజానికి ఆత్మచైతన్యం కారణంగానే జనులు వేర్వేరు రీతుల ప్రవర్తిస్తున్నారు. శుద్ధచైతన్యమే ఆత్మ. ఆత్మను తెలుసుకోవడానికి చేయవలసినదంతా నిశ్చలంగా ఉండడమే. నిశ్చలంగా ఉండడంకంటే ఇక సులభతరం ఏముంటుంది? అందుకే ఆత్మవిద్య అతిసులభమని చెప్పడం. **– భగవాన్‌రమణ మహర్షి**

సమస్త విశ్వం మార్పు చెందుతూనే ఉంటుంది. కానీ ఏనాటికీ మార్పు చెందని వాడొకడున్నాడు. అతడే భగవంతుడు. అతడే శాశ్వితుడు. నీవు ఆయనను ఎంతగా సమీపిస్తే, అంతగా నీమీద మాయా ప్రభావం తగ్గిపోతుంది. ఆయనను మరిత చేరువైనప్పుడు మాయను జయించగలవు. ఈ దృశ్యమాన ప్రకృతి నీ అధీనమవుతుంది. ఇకపై దాని ప్రభావం ఉండదు.
**– భగవాన్‌రమణ మహర్షి**

ఒకడు మహామేధావిగా ఉండవచ్చు. అయినా ఆధ్యాత్మికంగా అతడు శిశువుగానే ఉండొచ్చు. **– భగవాన్‌రమణ మహర్షి**

# ఓం

## శ్రీ ఓంకార స్వామివారితో నా చిన్ననాటి అనుభవం

ఓంకారస్వామివారికి నా హృదయపూర్వక ప్రణామములు. నేను నిత్యము స్వామివారి వద్దనే ఉండి వారిని అనుసరించుచు ఉండేవాడిని. నాకు చిన్నతనము నుండియు వేకువజామునే మేల్కొనుట పరిపాటి. నేను మేల్కొనేసరికి, స్వామివారు ఏదో వ్రాస్తూయుండెడివారు. అప్పటికి నా వయసు తెలియదు. కాని స్వామిసన్నిధిలో యుండుటవలన స్వామివారి టేబులు మీద మూడు వానరములతో యున్న బొమ్మ యుండెడిది. వాటిని చూసి మానవాళి నేర్చుకోవలసిన విషయములు అవి చూపించుచున్నవి. అవి ఏలననగా 1. తన రెండుకళ్ళను మూసుకొని చెడు చూడకు అనే భావనతో చెప్పుచున్నట్లుగా తోచుచున్నది. 2. తన రెండు చేతులతో నోరుమూసుకొనియున్నది. దాని విశేషం ఏమిటి అంటే, చెడు మాట్లాడకు అని చెప్పుచున్నట్లు అనిపిస్తున్నది. 3. తన రెండుచేతులతో చెవులు మూసుకొని చెడు వినకు అని చెప్పుచున్నట్లు అనిపిస్తున్నది. వీటి ద్వారా మనం నేర్చుకోవలసిన విషయం వ్యక్తం చేయుచున్నది. మనం ఇటువంటి మహనీయుల వద్ద నేర్చుకోవలసినవి చాలయున్నవి.

ముఖ్యముగా పనియే ఆరాధన అని నిత్యము బోధించెడివారు. నిత్యము భగవన్నామము స్మరించుచు ఇతరులను తరింపజేయుమని ప్రబోదించేవారు వారు ఎల్లప్పుడు. మానవాళి శ్రేయస్సు కోరి శాంతి స్థాపన చేయుమని కోరెడివారు. ఆశ్రమమునకు విచ్చేసిన సందర్శకులకు వారు బోధించెడి నామము ఓంకారము జేయుడని తెలిపెడివారు. స్వామి ఉద్దేశ్యం ఎవరి అనుకూలత వారిది. అందుకొరకు నిర్వాణ మందిరమునకు ఉత్తరదిశగా సోహం తపోవనం స్థాపించిరి. గయ నుండి అశ్వత్థ వృక్షము తీసుకొని వచ్చి దానిని నాటించిరి.

అది ఈ నాటికీ దేదీప్యమానముగా అచ్చట దర్శనం ఇచ్చుచున్నది. కొంచెం దూరములో జ్ఞానగుహ వున్నది. సాధన జేయువారికి ఆ చోట వసతి ఏర్పాటు జేసిరి. ఆ ప్రదేశం ధ్యానానికి అనుకూలమయినది. గుహను ఆనుకొని స్వామికి ఇష్టమైన నిశ్శబ్దమైన వాతావరణ ప్రదేశము. శాంతిపీఠం దాని విశిష్టత గురించి మనం తెలిసికొనుట మంచిది. స్వామివారు నిర్యాణము జెందకముందే సమాధి అని నామకరణం చేసియుండిరి. వ్యయ ప్రయాసలతో అక్కడికి చేరుకొనుట ద్వారా భక్తులు ఇబ్బంది పడుదురని భావించి ఆచోట సమాధి అవలేదు. కావున ఆయన



ఆత్మశాంతి కొరకు శాంతిప్రార్థన లిఖిత భాండాగారము అక్కడ ప్రతిష్ఠించిరి. శాంతి పీఠమునకు కొంతదూరములో విశ్వనాథ క్షేత్రం స్వామి ప్రతిష్ఠించిరి. నిత్యము శివునికి అభిషేకం జరుగుచున్నది. ఈ క్షేత్రం విశిష్టత చాల పవిత్రమైనది. ఈ చోట ధ్యానం చేసినవారికి మంచి అనుభూతులు గలుగునని స్వామి అభిప్రాయము. ఆ ప్రదేశం జపధ్యానాదులకు నిలయం. కావున మానవాళి సమాజ శ్రేయస్సు కోసం స్వామి మనకు మార్గం చూపి మనం తరించుటకు నిరంతరము అన్వేషించుచుండిరని తోచుచున్నది. ఆ మహనీయుని కృషి పట్టుదల వదలని విక్రమార్కుని వలె వారి జీవితం త్యాగం చేసిరి. మన వంతు పనిగా ఆయన ఆత్మశాంతించుటకు భగవన్నామ స్మరణ చేయుచు మనసు ప్రశాంతముగా యుండుటకు భగవంతుని వేడుకొని ప్రార్థించుదము.

రండి, త్వరపడండి, స్వామి ఆశీస్సులు పొందుటకు వేగిరపడండి.

ఓం...ఓం...ఓం...

ఇట్లు
**యాసరపు సత్యనారాయణ**
**శ్రీశాంతి ఆశ్రమము**

## దైవసాయుజ్యం

పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ శిష్యులైన కీ॥శే॥ శ్రీ గురుస్వామిగారి ధర్మపత్ని అయిన శ్రీమతి సరస్వతి ది. 19-12-2024వ తేదీన దైవసాయుజ్యము వారి స్వగృహమునందు (కోటగిరి, నీలగిరీస్) పొందినారు.

కోటగిరి శాంతి ఆశ్రమశాఖను అభివృద్ధిచేయుటకు గురుకుల పాఠశాల ప్రారంభించుటకు ఎనలేని కృషి చేసి ఆశ్రమ అభివృద్ధికి అన్ని విధముల సహాయ సహకారములు అందించిరి. వీరు మాతృఆశ్రమం. ఆశ్రమ శాఖలను కూడా సందర్శించి సాధన చేస్తూ అనేక విధములుగా ఆశ్రమ అభివృద్ధికి కృషిచేసిరి. వీరు భౌతికంగా లేకపోవడం ఆశ్రమానికి తీరనిలోటు. వీరి ఆత్మశాంతి కోరుతూ దైవప్రార్థన చేయడము జరిగినది. వారి కుటుంబ సభ్యులకు పూజ్య ఓంకార స్వామీజీ తగిన ఆత్మస్థైర్యము ప్రసాదించెదరు గాక.

మరణము ప్రకృతి యొక్క స్వభావము. జీవించియున్నప్పుడే అట్టి మృత్యుభయము కలుగని నిర్భయాత్మభావమును పొందుటకై ప్రయత్నించవలెను.
**- మళయాళ స్వామి**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 03-02-2025 (సోమవారం):** వసంతపంచమి ఆశ్రమ గురుకుల విద్యాలయమునందు ఉ॥ 9.00గం॥లకు సరస్వతీపూజ నిర్వహించబడును.

**తేది. 08-02-2025 (శనివారం):** దిగువ ప్రార్థనామందిరములో భీష్మ ఏకాదశి సందర్భముగా కృష్ణ అష్టోత్తర శతనామోచ్చారణ జరుపబడును.

**తేది. 26-02-2025 (బుధవారం):** మహాశివరాత్రి సందర్భముగా ఉ॥ 7.30ని॥లకు పైన విశ్వనాధ ఆలయమునందు రుద్రాభిషేకము సాయంత్రం గం.7.30ని॥లకు సహస్ర జ్యోతి లింగార్చన అన్నవర దేవస్థాన పండితులచే నిర్వహించబడును.

**తేది. 26-01-2025 (ఆదివారం):** (రిపబ్లిక్‌డే) గణతంత్రం దినోత్సవం సందర్భముగా ఆశ్రమ ప్రాధమికోన్నత పాఠశాలలో సభ జరుపబడును.

**తేది. 30-01-2025 (గురువారం):** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భముగా గాంధీ స్మరణ సభ నిర్వహించబడును.

## వార్తలు-మాతృఆశ్రమం-కాకినాడ శాఖ

**తేది. 06-01-2025 (బుధవారం) :** తోటపల్లి గ్రామస్థులకు అన్నదానం జరిగింది. పూజ్యఓంకారస్వామి 131వ జన్మదినం సందర్భముగా తోటపల్లి గ్రామంలో శ్మశానవాటిక నిర్మించబడింది.

**తేది. 20-01-2025 (సోమవారం):** పూజ్యశ్రీ స్వామీజీ జన్మదినం సందర్భముగా పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ పతాకావిష్కరణ గావించారు. సాయంత్రం గం॥5.30ని॥లకు పూజ్య మాతాజీ వారిచే జ్యోతి ప్రజ్వలన జరిగింది. సాయంత్రం గం.5.50-7.00లకు పద్మనాభానందస్వామివారి దివ్యభాషణము.

**తేది. 21-01-2025 (మంగళవారం):** ఉ॥ 7.30ని॥లకు పద్మనాభానంద స్వామివారిచే జ్యోతిప్రజ్వలన, 7.40ని॥లకు అష్టోత్తర సహస్ర నామపూజ పూజ్య పద్మనాభానంద స్వామివారిచే జరుపబడెను. మాతాజీవారిచే స్వామీజీ జన్మదిన సందేశము ఇవ్వబడెను. సాయంత్రం 5.00గం॥లకు పూజ్య పద్మనాభానంద స్వామీజీ వారిచే దివ్యభాషణము, రాచపల్లి పూజ్య రామానందస్వామి, పూజ్య లక్షణానందస్వామి వారి దివ్యభాషణములు ఇచ్చారు. ఉ॥9.30 ని॥లకు విశ్వనాధ మందిరములో శ్రీభాష్యం సీతారామమూర్తి, పిఠాపురం వారిచే బిళ్వార్చన జరుపబడెను.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## విరాళములు

1. శ్రీ కోదూరి శ్రీనివాస్ గారు (రాజమండ్రి) 10,000/-
2. శ్రీ సి.హెచ్.వి.వి. సత్యనారాయణగారు (కైకలూరు) 50,000/-
   బిల్డింగ్ రిపేరు నిమిత్తం
3. శ్రీ ఆకెళ్ళ రామన్ గారు (కొవ్వూరు) 3,000/-
4. శ్రీ కాటనేని వెంకట కృష్ణారావు (విశాఖపట్నం) 40,000/-
5. శ్రీ టి.ఎస్.ఆర్. మూర్తిగారు (హైదరాబాదు) 50,000/-
6. శ్రీమతి పందిరి లక్ష్మిగారు (శాంతి ఆశ్రమం) 1,00,000/-
   గోదానం మరియు గోగ్రాసం నిమిత్తం
7. ఎమ్.ఎస్.ఎమ్.వి. భరతలక్ష్మి గారు (కాకినాడ) 20,000/-
8. శ్రీ ఎస్.భీమేశ్వరావు గారు (శాంతి ఆశ్రమం) 1,00,000/-
   అన్నదానం - వస్త్రదానం
9. శ్రీ వి.ఎస్.సుబ్బారావు గారు (హైదరాబాదు) 5,000/-
   గోగ్రాసం నిమిత్తం
10. శ్రీ ఓరుగంటి మురళీమోహన్‌రావు గారు, శ్రీమతి అన్న పూర్ణ గారు
    (హైదరాబాదు), గోగ్రాసం నిమిత్తం 10,000/-
11. శ్రీ జి.కృష్ణగారు (శాంతి ఆశ్రమం) గోగ్రాసం నిమిత్తం 6,000/-
12. శ్రీమతి పందిరి లక్ష్మిగారు (శాంతి ఆశ్రమం) 5,000/-
    గోగ్రాసం నిమిత్తం
13. శ్రీమతి ప్రత్యూషగారు (విశాఖపట్నం) 10,000/-
14. శ్రీ కె.వెంకట్రాజుగారు, శ్రీ కె.ఎమ్.ఎమ్.కృష్ణరాజు గారు, 55,000/-
    శ్రీమతి కె.జ్యోతిర్మయి గారు, (బెంగుళూరు, హైదరాబాద్)
    వీరి తల్లిగారు శ్రీమతి కొండా పార్వతి గారు
    జ్ఞాపకార్థం గోదానం మరియు అన్నదానం నిమిత్తం

## శాశ్వతఅన్నదానం

1. శ్రీ నల్లమోతుల ప్రభాకరరావు గారు (రాజమండ్రి) 10,000/-
   శ్రీ పరమహంస యోగానందగారి జన్మదినము సందర్భముగా
2. శ్రీ కె.ఎమ్.కృష్ణరాజు గారు, శ్రీమతి మంజువాణిగారు 10,000/-
   (హైదరాబాదు) శ్రీమతి కొండా చినపార్వతిగారి జ్ఞాపకార్థం



3. శ్రీ దారపు రామారెడ్డిగారు (కాకినాడ) వీరి సోదరుడు 10,000/-
   శ్రీ డి.సత్యనారాయణరెడ్డిగారి జ్ఞాపకార్థం
4. శ్రీమతి సూరా విజయగారు (సికింద్రాబాదు) 10,000/-
   వీరి భర్త శ్రీ సూరా శ్రీనివాస్ గారి జ్ఞాపకార్థం
5. శ్రీమతి దారపు మంగమణి గారు
   W/o డి.సోమరాజు రెడ్డి (కాకినాడ), వీరి తల్లి 10,000/-
   బాకీ రాములమ్మ గురుగుల రెడ్డి గారి జ్ఞాపకార్థం
6. శ్రీ కొండా వెంకట్రాజు గారు (బెంగుళూరు)
   శ్రీ కె.ఎమ్.ఎమ్. కృష్ణరాజు గారు (హైదరాబాదు) 25,000/-
   శ్రీమతి కె.జ్యోతిర్మయి గారు (హైదరాబాదు)
   వీరి తల్లి గారు శ్రీమతి కొండా చినపార్వతి గారి జ్ఞాపకార్థం

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షెన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,<br>పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్భోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | | |
|---|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. | 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. | 10/- |
| 3. Soham | Rs. | 10/- |
| 4. Cosmic Fast | Rs. | 20/- |
| 5. Meditation | Rs. | 10/- |
| 6. Om Japa | Rs. | 10/- |
| 7. Control of Mind | Rs. | 30/- |
| 8. Cosmic Flashes | Rs. | 10/- |
| 9. In the Hours of Silence | Rs. | 10/- |
| 10. The Soul of Omkar | Rs. | 10/- |
| 11. How I learned English | Rs. | 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. | 10/- |
| 13. God Realization Now and Here | Rs. | 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. | 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. | 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. | 100/- |
| 17. Petals of Peace | Rs. | 20/- |
| 18. The Story of my life and Work | Rs. | 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. | 10/- |
| 20. The Four Initiations | Rs. | 10/- |
| 21. Musings | Rs. | 20/- |
| 22. Peace Prayer | Rs. | 20/- |

THE MISSION OF PEACE
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda